వృత్తిరీత్యా డాక్టర్ అయిన కె.వి. కృష్ణకుమారి శారీరక వ్యాధులను నిర్ధారించి, చికిత్స చేసినట్లే రచయిత్రిగా తన రచనలలో సామాజిక రుగ్మతలను విశ్లేషిస్తారు. పరిష్కార మార్గాలను సైతం సూచిస్తారు.

ఒకే రక్తం

డ్యూటీ రూంలో కూర్చుని క్షణం కళ్ళు మూసుకుని అలసట తీర్చుకునే సమయంలోనే గందరగోళంగా హాస్పిటల్ స్టాఫ్ రామారావుని చుట్టుముట్టింది.

ఉన్నట్లుండి కర్ఫ్యూ పెట్టారన్న వార్త దావానలంలా హైదరాబాద్ నగరాన్ని చుట్టుముట్టింది.

ఎక్కడి వాళ్ళక్కడే నిశ్చేష్టులై నిలబడి పోయారు.

కళ్ళముందు గమ్యం కారు చీకటిగా కనిపించిందొక్క క్షణం. మరుక్షణం ఉరుకులతో, పరుగులతో, ఉద్వేగంతో, ఉద్రేకంతో, ఆరాటంతో, ఆందోళనతో వాతావరణం ఉద్రిక్తంగా, ఊహాతీతంగా, దయనీయంగా మారి పోయింది.

అది జిల్లా కేంద్ర స్థాయి హాస్పిటల్.

ఆ రోజు డ్యూటీలో ఉన్నది మెడికల్ స్పెషలిస్ట్ డాక్టర్ రామారావు. ప్రొద్దుట్నుంచి క్షణం తీరిక దొరకని పనిలో సతమతమైపోతూ, కనీసం టీ త్రాగే సమయం కూడా లేకపోయినా విధి నిర్వహణను ఎంతమాత్రం అలక్ష్యం చెయ్యని రామారావు సాయంత్రం వార్డ్ రౌండ్లు వేసి, మరోసారి ఎమర్జెన్సీ కేసుల్ని చూసి, సిస్టర్స్‌కీ, వార్డ్ బాయిస్‌కీ ఇవ్వవలసిన ఆదేశాలు ఇచ్చి అలసటగా డ్యూటీ రూంలో కూర్చున్నాడు.

క్షణం కళ్ళు మూసుకుని అలసట తీర్చుకునే సమయంలోనే గందరగోళంగా హాస్పిటల్ స్టాఫ్ రామారావుని చుట్టుముట్టింది.

"సార్, కర్ఫ్యూ పెట్టేశార్ట సార్. ఉన్నట్లుండి అనౌన్స్ చేశార్ట. ఇప్పుడు ఇంటికెలా వెళ్ళాలి? వెళ్ళక పోతే ఎలా?" వార్డ్ బాయ్ మస్తాన్ దిగాలు పడి పోయాడు.

అతని కొడుక్కి రెండు రోజులుగా విపరీతమైన జ్వరంగా ఉంది. అంతకు ముందే గంట ముందుగా వెళ్ళిపోవాలని పర్మిషన్ తీసుకుని, డ్రెస్ మార్చుకుని, హడావుడిగా వెళ్ళే ప్రయత్నంలో ఉన్నాడు.

"ఓల్డ్ సిటీ దాటి వెళ్ళాలి సార్!" మస్తాన్ కళ్ళలో రాత్రంతా అపస్మారకంలో ఉన్న ఒక్కగానొక్క కొడుకే కనిపిస్తున్నాడు. తనిక్కడ చిక్కుపడిపోతే ఇంక కొడుకును ఈ జన్మలో చూడలేనేమోనన్న భావం నీళ్ళు నిండిన అతని కళ్ళలో స్పష్టంగా కనిపిస్తోంది.

"మా దొరసానికి నెలలు నిండినయి. మా అయ్యే కాలిరిగిన పేషెంటు. ... టప్పాచవుత్ర దాటి బోవాల."

యాదగిరి నిస్సహాయతను జాలిగా చూశాడు చంద్రయ్య. "యాద్గిరీ - మీ ఇంటికాడేనంట గొడవ లవుతుండయ్."

యాదగిరి మొహం పాలిపోయింది.

"సార్... మా ఆవిడ అసలే పిచ్చిది సార్. పసి, పిల్లల్తో నేవెళ్ళేదాకా తలుపులేసుక్కూర్చుంటుంది."

తను వెళ్ళకపోతే... ఇంటి పరిస్థితిని తలుచుకో టానికే భయపడిపోతున్నాడు ఆస్పత్రి వాచ్‌మన్ మోహన్ రావు.

ఏం చెయ్యాలో, ఎవర్నెలా సమాధానపరచాలో అర్థం కావడం లేదు డాక్టర్ రామారావుకు.

"సార్... మన యాంబులెన్స్‌లో అందర్నీ పంపించెయ్యండి సార్. రిటర్న్‌లో దార్లో ఉన్న స్టాఫ్‌ని నైట్‌కి తీసుకురావచ్చు. ఈ కర్ఫ్యూ పొడి గిస్తారంటున్నారు."

సిస్టర్ లక్ష్మి వంక సాలోచనగా చూశాడు రామారావు. అందరి కళ్ళలోను దైన్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఎవరి ఇళ్ళకు వాళ్ళు త్వరగా చేరుకోవాలనీ, ఏ

చిత్రాలు: ఎ.ఎస్.బాబు

అండా లేని తమ వాళ్ళను ఆదుకోవాలనీ ఎవరికి వాళ్ళే ఆత్రత పడుతున్నారు. దారి చూపించకపోడన్న ఆశతో రామారావునే చూస్తున్నారు.

"రాజలింగం...."

"సార్." రామారావు పిలుపు కోసమే ఎదురు చూస్తున్న డ్రైవర్ రాజలింగం ఆత్రంగా చూశాడు.

"అందర్నీ తీసుకుని ఎవరిళ్ళ దగ్గర వార్ని డ్రాప్ చేసి..." అర్థోక్తిగా ఆగిన రామారావు వంక నిస్సహాయంగా చూశాడు రాజలింగం.

"డీజిల్ చాలా తక్కు వగా ఉంది సార్. గోల్కొండా, మల్కాజ్‌గిరీ, టప్పాచవుత్రా, చత్రినాకా, కారవాన్, చార్మి నార్...ఇలా చాలా చోట్ల దింపి నైట్ వాళ్ళని తీసు కురావాలంటే..."

రాజలింగం ఇబ్బంది అర్థమైంది. అయినా తప్పదన్నట్లు చూస్తున్న రామారావు మానవత ముందు తలవంచక తప్పలేదు రాజలింగానికి.

"సరే సార్..మేనేజ్ చేస్తాను. కర్ఫ్యూ కాబట్టి బయటనుండొచ్చే కేసులూ- మనం బయటకు పంపే కేసులూ ఉండవు. కాబట్టి.. వెడతాము... ఒక రిద్దరు దొరికినా సరే నైట్ డ్యూటీ

స్టాఫ్‌ని తెస్తాను.''

అన్నదే తడవుగా అందరూ పొలోమంటూ కదిలారు.

మానసికంగా కూడా అలిసిపోయిన రామారావు ఇంకా మిగిలిన స్టాఫ్‌ని ప్రశ్నార్థకంగా చూశాడు.

సిస్టర్స్ షాజిదా, కృపావరం, లక్ష్మి, వాచ్‌మన్ సీతారాం, వెంకటేష్ వినయంగా నిలబడ్డారు.

డాక్టర్ రామారావు పేషెంట్స్‌కే కాదు, హాస్పిటల్ స్టాఫ్‌కి కూడా దేవుడితో సమానం. ఎవరికేమి అవసరం వచ్చినా అర మరికలు లేకుండా అందర్నీ అన్ని విధాలా ఆదుకునే రామారావంటే అందరికీ ప్రత్యేకాభిమానం.

రామారావు కళ్ళలోని భావం అందరికీ అర్థమైంది.

"వాళ్ళకున్నంత ఎమర్జెన్సీ మాకు లేదు సార్. ఇళ్ళ దగ్గరకి ఫోన్లు చేసి చెప్తాం. అదీగాక అందరం వెళ్ళిపోతే మీరొక్కరూ మేనేజ్ చేసేది ఎలా సార్? నైట్ స్టాఫ్ ఎవరొస్తారో ఏమిటో?''

అందరూ కూడబలుక్కున్నట్లు తనకు ఆసరాగా నిలుస్తుంటే అంత అలసటలోనూ రామారావు కళ్ళలో చిత్రమైన కాంతి మెరిసింది.

హాస్పిటలంతా క్షణాల్లో నిశ్శబ్దమైపోయింది. వీధులు నిర్మానుష్యమైన సూచనలు కనిపిస్తున్నాయి. ఫోను నిర్విరామంగా మోగుతూనే ఉంది.

సీతారాం, వెంకటేష్ విసుగు లేకుండా చెప్తూనే ఉన్నారు. డ్యూటీకి రాలేని అశక్తత కొందరిది. డ్యూటీలో ఉన్న వాళ్ళింకా ఇంటికి రాలేదన్న ఆందోళన కొందరిది. పేషెంట్సుకు అన్నం తీసుకురాలేని నిస్సహాయత కొందరిది. పేషెంట్సెలా ఉన్నారోనన్న ఆవేదన కొందరిది.

మౌనంగా వింటూ కూర్చున్న రామారావు గుండెల్లో చిరుమంట మొదలైంది. లక్ష్మి గుర్తుకువచ్చి అశాంతీ, అర్థంకాని భయం నిలువునా దహించడం మొదలుపెట్టింది.

ప్రొద్దున డ్యూటీకి వచ్చేముందు ఎప్పుడూ లేనంత బేలగా చీటికీ మాటికీ కన్నీళ్ళు పెట్టుకుంటున్న లక్ష్మి అమాయకత్వమే కళ్ళముందు కనిపిస్తోంది.

* * *

"పిచ్చి! ఏమిటిది? ఇప్పుడు నీకేమైందని?''

లక్ష్మి కళ్ళలో నీటిపొర మెరిసింది.

"ఎందుకో ఇవాళ భయంగా ఉందండీ... మీరు ఎరెవర్తోనైనా డ్యూటీ మార్చుకోకూడదూ?''

"ఉన్నట్లుండి డ్యూటీ చెయ్యమంటే ఎవరు చేస్తారు లక్ష్మీ? అయినా నేను కావాలని వేసుకున్న డ్యూటీనేగా ఇది. రేపట్నుంచీ నువ్వు వెళ్ళమన్నా పది రోజుల దాకా నీదగ్గర్నుంచి కదిలేదే లేదు. ఓ.కే.''

లక్ష్మిని బుజ్జగిస్తున్నా రామారావు మనసు మనసులో లేదు. లక్ష్మి నిండు గర్భవతి. మొదటి కాన్పులోనే దక్కదనుకున్న లక్ష్మి పుట్టగానే బాబుని దూరం చేసుకున్నా - ప్రాణాల్తో తన కోసం మిగిలింది. ఈసారి గుర్రపు వాతం లక్షణాలున్నాయి. తనకు లక్ష్మే ముఖ్యమని చెప్పినా లక్ష్మి పంతం నెరవేర్చుకుంది.

రామారావుకి బాబు నివ్వబోతోంది.

లక్ష్మి ఆరోగ్యాన్ని కూడా లెక్కచెయ్యడం లేదు.

రామారావు ఏకాగ్రతలో దైవత్వం కనిపిస్తోంది. అలిసినా చెక్కుచెదరని అతని దీక్షలో అతని వ్యక్తిత్వం అగ్ని శిఖలా వెలుగుతోంది. ఎంతో సేవటికి తృప్తిగా నిట్టూర్చాడు.

తనందించబోయే బాబును చూసి భర్త పొందబోయే ఆనందాన్ని తలుచుకుంటూ రోజులు లెక్కపెట్టు కుంటోంది.

"ఇంకా డెలివరీకి పదిహేను రోజులు టైముంది. లేనిపోని భయాలు పెట్టుకోక ధైర్యంగా ఉండు. దుర్గమ్మగారు నీకు తోడుంటానన్నారు కనుకే నేను నిశ్చింతగా డ్యూటీకి వెడుతున్నాను. ఎల్లుండి హాస్పిటల్లో నిన్ను చేర్పించడం... మనం నిర్ణయించిన సమయా నికి బాబు బయటకు రావడం...''

రామారావు ధైర్యం చెప్తున్నా లక్ష్మి మనస్ఫూర్తిగా నవ్వలేకపోతోంది.

"నువ్విలా ఉంటే నేనక్కడ డ్యూటీ చెయ్యలేను. చెప్తున్నా.''

భర్తలో బింకం సడలుతున్నట్లనిపించి, పెదాలు బిగించి బలవంతాన నవ్వుతున్న లక్ష్మిని వదల్లేక వదల్లేక వచ్చాడు రామారావు.

* * *

'లక్ష్మి ఎలా ఉందో...'

ఫోనందుకోబోతున్న రామారావు భుజంమీద బలమైన చెయ్యి పడింది.

"అరె షబ్బీర్!- వాట్ ఎ సడన్ సర్‌ప్రైజ్!''

రామారావు అప్రయత్నంగా లేచి నిలబడ్డాడు. డాక్టర్ షబ్బీర్ ఎనస్తటిస్ట్. రామారావు కొలీగ్. మంచి ఫ్రెండు. ఆ సమయంలో షబ్బీర్ లాంటి ఆత్మీయులు రావడం రామారావు కెంతో సంతోషాన్నిచ్చింది. కానీ ఆ క్షణంలో రామారావుని చూసి సాక్షాత్తూ దేవుణ్ణే చూసినట్లుగా సంబరపడ్డ షబ్బీర్ ఆత్రంగా రామారావు చెయ్యందుకున్నాడు.

అప్పుడు చూశాడు రామారావు, షబ్బీర్ కళ్ళలో కనిపించే ఆనందం వెనుకనే ఉన్న విషాద ఛాయల్ని.

అప్పుడే గమనించాడు రామారావు షబ్బీర్ చేతులు విపరీతంగా వణకుతూ ఉండడం.

"వాట్ హాపెండ్?'' రామారావు భుజాల్ని గుచ్చి పట్టుకున్నాడు షబ్బీర్.

"రామూ, డాడీకి మళ్ళీ ఎటాక్ వచ్చిందిరా. కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఎక్కడికి తీసుకువెడదామన్నా కర్ఫ్యూ. ధైర్యం చేసి స్కూటర్ వెనకాల కూర్చోబెట్టు కుని ఇంతదాకా రాగలిగాను. దేవుళ్ళా నువ్వున్నావు.''

అత్యవసరాన్ని గమనించిన రామారావుకు షబ్బీర్ మాటలు వినిపించలేదు.

షబ్బీర్ తండ్రి తనకీ తండ్రితో సమానమే. పైగా తనంటే ఆయనకున్న వాత్సల్యం - డాక్టర్‌గా తన పట్ల ఆయనకున్న గురి ఆయన ప్రాణాల్ని రెండుసార్లు కాపాడగలిగింది.

అపస్మారకంగా ఉన్న షబ్బీర్ తండ్రిని వార్డులో చేర్చడం, ఎమర్జెన్సీ ట్రీట్‌మెంట్ ప్రారంభించడం, అర్జెన్సీని గమనించి ఇ.సి.జి. తీస్తూ మారుతున్న స్థితిని బట్టి క్షణక్షణానికీ మందులివ్వడం జరిగి పోతుంటే, నిశ్చింతగా రామారావునే చూస్తూ ఉండి పోయాడు షబ్బీర్.

రామారావు ఏకాగ్రతలో దైవత్వం కనిపిస్తోంది. అలిసినా చెక్కుచెదరని అతని దీక్షలో అతని వ్యక్తిత్వం అగ్నిశిఖలా వెలుగుతోంది.

ఎంతో సేపటికి తృప్తిగా నిట్టూర్చాడు రామారావు.

"నువ్వే డ్యూటీలో లేకపోతే డాడీ నాకు దక్కే వాడు కాదురా.'' సిస్టర్ అందించిన కాఫీకప్పు కృతజ్ఞతతో తొణికింది.

"నీ మొహం...''

షబ్బీర్ మాటల్లో అతిశయోక్తి లేదని తెలిసిన రామారావు ఇంకేమీ అనలేకపోయాడు.

"నిజంరా... బయట పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుసా? పిట్టకూడా బయట ఎగరడం లేదు. ఓల్డ్ సిటీ ఘోరంగా ఉందిట. డాడీని తీసుకుని ఎక్కడికి వెళ్ళను? ఏ నర్సింగ్‌హోంలోనూ స్పెషలి స్టెవ్వరూ లేరు. దేవుడి మీద భారమేసినందుకు...''

"అతిగా పొగడకురా.''

ఖాళీ కప్పు టేబుల్ మీద పెట్టి క్షణం కళ్ళు మూసుకున్నాడు రామారావు.

"దీదీ ఎలా ఉందిరా?"

"లక్ష్మా!" ఉలిక్కి పడ్డాడు రామారావు.

"డ్యూ డేట్ ఎప్పుడు?"

"ఎల్లుండి నర్సింగ్ హెూంలో అడ్మిట్ చేస్తున్నారా. ఎక్లాంప్సియా (గుఱ్ఱపువాతం) టెండెన్సీ ఉందికదా. పైగా జనరల్ కండిషన్ బాగాలేదు. వచ్చేవాళ్ళూ ఎవరూ లేరు."

రామారావు గొంతులో పుట్టెడు దుఃఖమున్నట్లని పించింది. సాధారణంగా పైకి తేలని రామారావు కళ్ళలో ఊహించని దిగులు కనిపించింది.

లక్ష్మిని కావాలని ఏరి కోరి చేసుకున్నాడు రామారావు. దంపతులకు రెండువైపులవారూ దూరమయ్యారు. పెద్దదిక్కు లేకపోయినా ఒకరికొకరుగా బ్రతుకుతున్న రామారావు బాధను డాక్టర్ షబ్బీర్ అర్థం చేసుకోగలడు.

"నువ్వు్రతుణ్ణి బయటికి రానియ్యరా. ఎవరికి వాళ్ళే వంతులమీదొచ్చి వాల్తారు-"

షబ్బీర్ ఓదార్పుకి సమాధానంగా అద్దోలా చూశాడు.

"ఎవరో రావాలని కాదురా లక్ష్మికి ధైర్యం చెప్పి వచ్చాను కానీ ఈ కర్ఫ్యూ గొడవలో... ఏమో... ఏ రోజు లెలా ఉంటాయో?"

రామారావు సందేహాలు గొంతులో ఉండగానే గుండె అవిసేలా ఫోన్ మోగింది.

యాథాలాపంగా ఫోనందుకున్న షబ్బీర్ మొహంలో రంగులు మారాయి.

"నేనాంటీ...షబ్బీర్‌ని. ఇప్పుడెలా ఉంది?"

రామారావును చూసే ధైర్యం లేనట్లు మాట్లాడుతున్న షబ్బీర్ ప్రవర్తనకు రామారావు గుండె చిక్కబట్టి నట్లయింది.

ఎవరూ - ఏమిటీ అని అడిగే ధైర్యం చాలని రామారావు చేతికి మౌనంగా ఫోనందించాడు షబ్బీర్.

ఫోనందుకున్న రామారావు మొహం వివర్ణమైంది.

చేతులు ఫోన్‌మీద బిగుసుకున్నాయి.

అవతల దుర్గమ్మగారు చెప్తున్న విషయాలేవీ తలకెక్కడం లేదు.

"ఎలా?... ఎలా రావాలి?... నాకేం తోచడం లేదు. ఇప్పుడెలా?" ఒక మాట కొక మాటకి సంబంధం ఉండడం లేదు. మతి పోయినవాడిలా మాట్లాడుతున్న రామారావు నుంచి ఫోన్ బలవంతంగా లాగేసు కున్నాడు షబ్బీర్.

"హలో... ఆంటీ... దీదీని జాగ్రత్తగా చూస్తుండండి. నేనొచ్చేస్తున్నాను. మరేం పరవాలేదు. హాస్పిటల్‌కి నే తీసుకువెడతాను."

బరువుగా ఫోన్ పెట్టేసిన షబ్బీర్ చెయ్యి మరింత బరువుగా రామారావును ఊరడించింది.

"రాముా... ఈ పరిస్థితుల్లో నువ్వు దీదీ దగ్గరున్నా.. నువ్వు కంగారుపడి ఆవిడ్ని కంగారు పెట్టేస్తావు. నేను తక్షణం వెళ్ళి దీదీని హాస్పిటల్‌కి తీసుకు వెళ్తాను."

నిస్తేజంగా నిలబడ్డ రామారావును బలవంతంగా కుదిపాడు డాక్టర్ షబ్బీర్.

"బీ బ్రేవ్ మై డియర్." వెంటనే ఆదిత్యా నర్సింగ్ హెూమ్‌కి డయల్ చేశాడు. "డాక్టర్ మధుసూదన్! డాక్టర్ షబ్బీర్ స్పీకింగ్. డాక్టర్ ఇందిరకానీ.. కృష్ణకానీ ఎవరైనా సరే... గైనకాలజిస్ట్ లెవరైనా అందుబాటులో ఉన్నారా?... యాఁ... ఎమర్జెన్సీ... డాక్టర్ రామారావు మిసెస్... బాత్‌రూమ్‌లో పడిపోయార్ట... బాగా బ్లీడింగవుతోందిట... షీ ఈజ ఇన్ ఫుల్‌టర్మ్. బట్... మోస్ట్ కాంప్లికేటెడ్ కేస్... అవును... ఇదివరలో ఎక్లాంప్సియా వచ్చింది. సిజేరియన్ అయింది. సేమ్ కేస్. ఎలాగోలా తీసుకొస్తాను... ప్లీజ్ హెల్ప్ మీ."

"రాముా, వెళ్ళిరానా?"

"నా లక్ష్మి నాకింక కనిపించదురా. ప్రొద్దున్నే ఆఖరిసారి చూడడం.." రామారావు గుండెల్లోంచి దుఃఖం తన్నుకువచ్చింది.

"పిచ్చిగా మాట్లాడకురా... నేనేమైపోయా

రామారావు కళ్ళలోకి ఆరాధనగా చూసింది లక్ష్మి. పసిపాపలాంటి లక్ష్మిని మరోసారి గాఢంగా గుండెలకు హత్తుకున్నాడు రామారావు.

ననుకున్నావు? నేను బ్రతికుండగా అంత పని జరగ నిస్తానా... నువ్వు ధైర్యంగా ఉండు."

షబ్బీర్ వంక దీనంగా చూశాడు.

బయట కర్ఫ్యూ.. మెడికల్ ఫెసిలిటీస్ అందుతాయో లేదో. అసలు లక్ష్మి ఎలా ఉందో? ఇంక రామారావు దగ్గర క్షణం వేస్ట్ చెయ్యదలుచుకోలేదు షబ్బీర్.

షబ్బీర్ స్కూటర్ దూసుకుపోతున్న చప్పుడు రామారావుకి లీలగా వినిపించింది.

* * *

"ఏమిటండీ అలా చూస్తారూ... నా చేతిలో ఒట్టేశారా లేదా... ఇంకది జరిగితీరాలంతే."

పట్టుదలగా అంటున్న లక్ష్మి మొండితనానికి చికా కేసింది రామారావుకు. "విషయం చెప్పకుండా ఒట్టే యించుకుంటే, అది లెక్కలోకొస్తుందా ఏమిటి? అయినా నీ పిచ్చిగానీ - మనం ఒకరి కొకరం ఉండగా - మన మధ్య మరో సలుసెందుకు?"

లక్ష్మి సున్నితంగా నోరు మూసింది.

"నా మీద ప్రేమెక్కువై అలా అంటున్నారు కానీ, మీకు మాత్రం లేదూ చిన్న బాబుని ఎత్తుకోవాలని. మనం ఒకరికొకరం ఉన్నాం. నిజమే. కానీ మనకోసం ఇంకొకరుండద్దూ. అప్పుడు మనకోసం ఎవరూ రాకపోయినా మనకేమీ అనిపించదు... కదండీ?"

చిన్నపిల్లలా తన గుండెల్లో తలదాచుకున్న లక్ష్మి గుండెల్లో రగిలే అగ్నిపర్వతాన్ని గాఢంగా పొదివి పట్టుకున్నాడు రామారావు. "కానీ కాన్పు నీకొక పునర్జన్మ లక్ష్మి. ఈసారి నిన్ను బలి చేసుకుంటే..."

రామారావు కళ్ళలోకి ఆరాధనగా చూసింది లక్ష్మి.

"మీలో నా మీదింత ప్రేమ బ్రతికున్నంత కాలం నేనెప్పుడూ ఎవ్వరికీ ఏ పరిస్థితుల్లోనూ బలైపోను... సరేనా. అలా భయం భయంగా చూడక్కర్లేదు... నాకు బాబు నిస్తానన్నారు... ఇవ్వా ల్సిందే... అంతే."

పసిపాప లాంటి లక్ష్మిని మరోసారి గాఢంగా గుండె లకు హత్తుకున్నాడు రామారావు.

* * *

"సార్, డాక్టర్ షబ్బీర్ ఫాదర్‌గారికి బి.పి. డౌనైంది సార్."



చివ్వున లేచాడు డాక్టర్ రామారావు.

కర్తవ్యం, వృత్తిధర్మం, మానవత్వం క్షణంలో రామారావుని తిరిగి ఆక్రమించాయి.

తెల్లని గెడ్డంతో - మల్లె పువ్వులాంటి దుస్తుల్లో తెల్లగా పాలిపోయి మత్తులో చలనం లేనట్లు కనిపిస్తున్న ఆయన బలహీనమైన చేతిని ఆత్రంగా, ఆప్యాయంగా అందుకున్నాడు.

నాడి ఎక్కడో కొట్టు కుంటోంది. రామారావు గుండె చిక్కబట్టినట్లయింది. బి.పి. చూసి డ్రిప్‌లో కంగారుగా ఇంజక్షన్స్ గుప్పించాడు. కాళ్ళకింద మంచం పైకి ఎత్తి స్టూల్ మీద మరింత ఎత్తుగా ఉండేలా అమర్చాడు. ఆక్సిజన్ పెట్టి పరిస్థితి గమనిస్తూ అలాగే ఉండి

రాత్రి ఒంటి గంట దాటింది. నిశ్శబ్దంగా ఉన్న ఫోను టైం బాంబులా కనిపిస్తోంది. ఏదో నిముషాన భయంకరమైన వార్తతో గుండెని బ్రద్దలు చేసేలా ఉందది.

పోయాడు. వడిలి బిగుసుకుపోయినట్లున్న ఆ పెదాలు గెడ్డాన్ని మించిన తెల్లదనంతో, చల్లదనంతో తిరిగి ఆప్యాయంగా ఆత్మీయతను చిందిస్తాయన్న నమ్మకం రామారావులో గాఢంగా ఉంది.

కరుణనే వెదజల్లే ఆ కళ్ళు తిరిగి తనకి కొండంత అండను అందిస్తాయన్న ఆత్మవిశ్వాసం ఉంది.

ఆయన కిష్టమైన తన స్పర్శ ఆయనలో తిరిగి చైతన్యాన్ని కలిగిస్తుంది. షబ్బీర్‌నీ, తననీ ఒకేలా గుండెల్లో దాచుకోగల ఆ పితృ హృదయం తమ కేవిధమైన బాధ కలిగినా సహించలేదు.

ఆ నమ్మకాన్ని అణువణువునా నింపుకున్న రామారావు ఎంతోసేపటికి గుండెల నిండా గాలి పీల్చుకున్నాడు. తన కృషి పూర్తి ఫలితాన్ని అందించబోతోందన్న నమ్మకం వెయ్యేనుగుల బలాన్ని ఇచ్చింది. అప్పటిదాకా గుండె మారుమూలన నొక్కి ఉంచిన ఆవేదన ఉవ్వెత్తున పైకి లేచింది.

కళ్ళముందు చీకటి పేరుకున్నట్లనిపించి నిస్సత్తువతో పైకి లేవలేకపోతున్న రామారావుకు సందేహిస్తూనే ఆసరా అందించాడు వాచ్‌మన్ సీతారాం.

"సీతారాం... నాకు ఫోనేమైనా వచ్చిందా?"

గొంతు చించుకుని అరవాలనిపించింది రామారావుకు. కానీ, ఏదో భయం, అధైర్యం గొంతును నొక్కేస్తోంది.

"సార్ - పొద్దుట్నుంచీ టీ నీళ్ళయినా తాగలేదు."

సీతారాం వేడి కాఫీ అందిస్తుంటే సున్నితంగా తిరస్కరించాడు రామారావు.

"సార్... ఓల్డ్‌సిటీలో పరిస్థితి చాలా దారుణంగా ఉందిట సార్... తలుపులు పగలగొట్టి - ఇళ్ళలో చేరి ఇష్టమొచ్చినట్లు పొడిచి పోతున్నార్ట. తెల్లార్తే పేపరు చూడాలంటేనే భయమేస్తోంది సార్."

"ఈ రోజసలు తెల్లవార్తుందో లేదో సీతారాం."

బిత్తరపోయి చూశాడు సీతారాం. ఎప్పుడూ నిండుగా, హుందాగా, నిండుకుండలా, అందర్నీ ఆదుకునే మనిషిగా డాక్టర్ రామారావు అందరికీ పరిచితుడు.

బేలతనంతో నీరుగారిపోతున్న రామారావు వైఖరి విచిత్రంగా అనిపించింది సీతారాంకు.

"సార్ని కాసేపు రెస్ట్ తీసుకోనియ్యి."

వెంకటేష్ మందలింపుతో సందేహంగానే బయట కొచ్చాడు సీతారాం. నిశ్శబ్దం భయంకరంగా ఉంది. ఈ శ్మశాన నిశ్శబ్దం గుండెని మెత్తగా కోసేస్తోంది.

రాత్రి ఒంటిగంట దాటింది. నిశ్శబ్దంగా ఉన్న ఫోన్ టైం బాంబులా కనిపిస్తోంది. ఏదో నిమిషాన భయంకరమైన వార్తతో గుండెని బ్రద్దలు చేసేలా ఉందది. అసహనంగా హాస్పిటలంతా పిచ్చిగా తిరిగి తిరిగి తన గదికి రాక తప్పలేదు.

భయంకరమైన వార్త ఏదైనా వినక తప్పదేమో! తప్పదా! గుండెల్ని చీలుస్తూ ఫోన్ మోగింది. మోగుతోంది.

రామారావు నిలువెల్లా చెమటలు పట్టాయి... మనసు, శరీరం అదుపు తప్పుతోంది... ఫోనందుకో డానికి సాహసించలేకపోతున్నాడు. మామూలుగా ఆపరేషన్ జరిగితేనే లక్ష్మి పరిస్థితి ప్రమాదకరమైంది. అందులో విషమించిన ఈ పరిస్థితుల్లో... ఈ కర్ఫ్యూలో...



"సార్... మీకే సార్ ఫోన్... ఆదిత్యా నర్సింగ్‌హోమ్ నించి." రామారావు నిలువునా క్రుంగిపోయాడు.

లక్ష్మి ఇక లేదన్నదే ఆ ఫోన్. మొహం పాలిపోయింది. ఫోనందుకోలేకపోతున్న రామారావు స్థితి సీతారాంకు అర్థం కాలేదు.

"సార్... డాక్టర్ ఇందిర గారట... మీతో అవసరంగా మాట్లాడాలట." గుండె రాయి చేసుకున్న రామారావు చేతిలో ఫోన్ బిగుసుకుపోయింది.

"ఎస్... డాక్టర్ రామారావ్ స్పీకింగ్..."

"కంగ్రాచ్యులేషన్స్ డాక్టర్... నేను డాక్టర్ ఇందిరని మాట్లాడుతున్నా" రామారావు అయోమయంగా చూశాడు. ఊపిరి పీల్చుకునే శక్తికూడా లేనట్లు చూస్తున్నాడు.

"డాక్టర్... వింటున్నారా..."

"ఎస్..." కంఠం నూతిలోంచి వస్తున్నట్లుంది.

"మీరు చాలా అదృష్టవంతులు డాక్టర్. లక్ష్మిగారు చాలా కాంప్లికేషన్స్ నుంచి బతికి బయట పడ్డారు. సిజేరియన్ అయింది. బాబు చాలా ముద్దుగా ఉన్నాడు."

రామారావు కళ్ళలో నీళ్ళు పొంగుతున్నాయి.

"డాక్టర్ షబ్బీర్ అష్టకష్టాలూ పడి - స్కూటర్ మీదే ఆవిడ్ని తీసుకు వచ్చారు. కాస్త ఆలస్యమై ఉంటే తల్లీ బిడ్డా దక్కేవారు కాదు." రామారావు గుండెల్లోంచి దుఃఖం తన్నుకు వస్తోంది.

"డాక్టర్ షబ్బీర్ ఎనస్తీషియా ఇవ్వటమే కాదు- ఆయన బ్లడ్ ఇచ్చి లక్ష్మిగార్ని బ్రతికించుకున్నారు."

"థాంక్యూ - థాంక్యూ- డాక్టర్ ఇందిరా."

డాక్టర్ రామారావు గొంతులో గుండె స్పందన వినిపిస్తోంది. అవతల ఫోన్ పెట్టేసిన శబ్దం విని అప్రయత్నంగా ఫోన్ పెట్టేశాడు రామారావు. తనున్న స్థితి తనకు అర్థం కావడం లేదు.

తను విన్నది నిజమో... అబద్ధమో కూడా అర్థం కావడం లేదు.

నిజమేనన్న నిజాన్ని- ఆ సంతోషాన్ని భరించలేకపోతున్నాడు - అబద్ధమైన భయంకర స్వప్నాన్ని మరిచిపోలేకపోతున్నాడు.

"సార్... సార్... ఏమైంది సార్.?"

వెంకటేష్‌కి సమాధానంగా భుజాలు పట్టుకుని కుదిపేశాడు. సీతారాం చేతుల్ని ఆప్యాయంగా అందుకున్నాడు. పరుగు లాంటి నడకతో షబ్బీర్ తండ్రి మంచం దగ్గరికొచ్చాడు రామారావు. ఆయన మొహంలో జీవకళ ఉట్టిపడుతోంది. అలవాటైన రామారావు చేతులు ఆయన పల్స్ తడిమాయి. "అంకుల్... అంకుల్..."

సున్నితంగా పిలుస్తున్న రామారావు పిలుపుతో ఆయన కళ్ళు బరువుగా విచ్చుకున్నాయి.

రామారావుని చూసి జీవత్వాన్ని నింపుకున్నాయి.

"రామూ..." ఆయన పెదాలు - ఆత్మీయంగా పిలుస్తుంటే ఆనందాన్ని పట్టలేని డాక్టర్ రామారావు ఆయన చెయ్యందుకుని కళ్ళకద్దుకున్నాడు.

రామారావు చేతిని మృదువుగా ముద్దు పెట్టుకుంటున్న ఆయన కళ్ళకి రామారావులోనే షబ్బీర్ కనిపించాడు. "మే గాడ్ బ్లెస్యూ మై సన్."

తెల్లవారింది.

"పాతబస్తీలో కనీ వినీ ఎరుగని నరమేధం."

పేపర్లలో అక్షరాలు కూడా రక్తాన్ని కక్కుతున్నాయి.

"మత సామరస్యం లోపించి, మానవత్వాన్ని మటు మాయం చేసి, అర్థంకాని వైషమ్యాలతో - అర్థంకాని కక్షలతో -కార్పణ్యాలతో - రావణ కాష్ఠంలా రగులుతూ - మారణ హోమానికీ - నరమేధానికీ దారి తీస్తున్న ఈ ఘోర పరిస్థితులకు విముక్తి లేదా?

ఇంక ప్రశాంతత అనేదే ఈ సమాజంలో మిగిలి ఉండదా?

భవిష్యత్తులో మానవత్వపు ఛాయలక్కూడా నిలువ నీడనేది ఉండే అవకాశమే లేదా?

ఈ ప్రశ్నార్థకాలను దాటుకుంటూ వార్డు వైపుకు దారి తీస్తున్న డాక్టర్ రామారావు మనసు త్వరపడుతోంది - ఆరోగ్యాన్ని అనూహ్యంగా పుంజుకున్న డాక్టర్ షబ్బీర్ తండ్రి ఆశీస్సులను మరోసారి అందుకోడానికి, ఆదిత్యా నర్సింగ్ హోంలో తన లక్ష్మికి ప్రాణదానం చేసిన తన ప్రాణమిత్రుడు డాక్టర్ షబ్బీర్‌ని కరవుదీరా కౌగలించుకోవడానికి-

అతని రక్తంతో పునర్జన్మ నందుకున్న తన లక్ష్మినీ-

లక్ష్మి తన కందించిన అపూర్వ వరాన్ని-

మనసుదీరా కళ్ళనిండుగా చూసుకోడానికి! ●